**గత ప్రభుత్వాల హయాంలో అభివృద్ధికి నోచక అన్ని రంగాల్లోనూ వెనుకబాటుకు గురైన నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ నియోజకవర్గం బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధిలో దూసుకుపోతున్నది. ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అభ్యర్థనతో సీఎం కేసీఆర్ ఐదేండ్లలో నియోజకవర్గానికి రూ.2,526 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో 5 మండలాలు, మిర్యాలగూడ మున్సిపాలిటీని ప్రగతిపథంలో ముందుంచారు.**

– మిర్యాలగూడ, అక్టోబర్ 30



మిర్యాలగూడలోని నల్లగొండ రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు

# బీఆర్ఎస్ సర్కారులో మిర్యాలగూడకు మహర్దశ

**రూ.2,526 కోట్లతో నియోజకవర్గం అభివృద్ధి**



మిర్యాలగూడ పట్టణంలో నిర్మించిన మినీ రవీంద్రభారతి

- రూ.30వేల కోట్లతో పవర్‌ప్లాంట్ ఏర్పాటు
- ఏరియా ఆస్పత్రి 200 పడకలకు పెంపు
- రూ.వెయ్యి కోట్లతో ఐదు లిఫ్టులు మంజూరు
- రూ.300 కోట్లతో బీటీ, సీసీ రోడ్ల నిర్మాణాలు
- రూ.56 కోట్లతో 12 చెక్‌డ్యాంల నిర్మాణం
- రూ.600 కోట్లతో పట్టణాభివృద్ధి
- బీఆర్ఎస్ సర్కారు జేజేలు పలుకతున్న జనం

## అన్ని రంగాల్లో నియోజకవర్గం అభివృద్ధి



2014 నుంచి ఇప్పటి వరకు వరకు నేను ఎమ్మెల్యేగా అనేక పథకాలతో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశాను. దేశంలోనే అతి పెద్ద మెగా థర్మల్ పవర్ ప్లాంట్(వైటీపీఎస్)ను సీఎం కేసీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డి సహకారంతో రూ.30 వేల కోట్లతో నిర్మిస్తున్నాం. ఈ పవర్ ప్లాంట్‌తో వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుది. ఐదు లిఫ్టుల నిర్మాణానికి రూ.వెయ్యి కోట్లు మంజూరు చేయించా. రానున్న రోజుల్లో సీఎం కేసీఆర్ అండదండలతో మరింత అభివృద్ధి చేస్తా.

**– నల్లమోతు భాస్కర్‌రావు, మిర్యాలగూడ ఎమ్మెల్యే**

## ఏరియా ఆస్పత్రి భవన నిర్మాణానికి రూ.16కోట్లు

మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిని జిల్లా కేంద్ర దవాఖానగా మార్చేందుకు ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు కృషితో ఇప్పుడు ఉన్న వంద పడకలకు తోడుగా మరో వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి రూ.16 కోట్లు మంజూరు చేయించారు. ప్రస్తుతం ఆ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. సీఎం కేసీఆర్ ఆదేశాలతో ఇక్కడ డయాలసిస్ కేంద్రం ఏర్పాటుతో ప్రతిరోజూ 30మంది డయాలసిస్ చేయించుకునే అవకాశం లభించింది. దీంతోపాటు ఈ ఆస్పత్రికి ప్రతిరోజూ 600 మందికి పైగా వివిధ రకాల వ్యాధులతో వైద్య చికిత్సలు చేయించుకునేందుకు వచ్చి వెళ్తుంటారు.

## శరవేగంగా లిఫ్టుల పనులు..

సీఎం కేసీఆర్ అండదండలతో ఎమ్మెల్యే భాస్కర్‌రావు దామరచర్ల, అడవిదేవులపల్లి, మాడ్గులపల్లి మండలాల పరిధిలో ఐదు ఎత్తిపోతల పథకాలను మంజూరు చేయించారు. వీటి నిర్మాణానికి రూ.వెయ్యి కోట్లు మంజూరు చేయించారు. కేశవపురం– కొండ్రపోల్ లిఫ్ట్–1, బొత్తలపాలెం– వాడపల్లి లిఫ్ట్–2, దున్నపోతులగండి–చిట్యాల చాంప్లాతండా లిఫ్ట్–3, వీర్లపాలెం లిఫ్ట్–4 పనులు వేగంగా జరుగుతున్నాయి. తోపుచర్ల లిఫ్ట్‌కు రూ.9.90 కోట్ల నిధులు మంజూరు కాగా, పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. వీటి నిర్మాణం పూర్తయితే 50 వేల ఎకరాలు సస్యశ్యామలం కానున్నాయి.

## పట్టణంలో అభివృద్ధి పనులు

మిర్యాలగూడ పట్టణంలోని 48 వార్డుల్లో రూ.18 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న మినీ రవీంద్రభారతిని రూ.9.80 కోట్లతో నిర్మించారు. జ్యోతిరావుపూలే భవనం రూ.1.25 కోట్లు, సంత్ సేవాలాల్ భవనం రూ.1.25కోట్లు, అంబేద్కర్ భవనం రూ.1.25కోట్లతో నిర్మించారు. రాజీవ్‌చౌక్ నుంచి వై జంక్షన్ వరకు రూ.21 కోట్లతో వంద ఫీట్ల బీటీ రోడ్డు, సెంట్రల్ లైటింగ్, ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించారు. మున్సిపాలిటీ పరిధిలో రూ.1.67 కోట్లతో ట్రాక్టర్లు, ఆటోలు, జేసీబీ కొనుగోలు చేశారు. రూ.72 లక్షలతో పట్టణంలోని పలు కూడళ్ల వద్ద పబ్లిక్ టాయిలెట్లు నిర్మించారు. అదేవిధంగా టీఎస్పీ, సీడీపీ నిధులు రూ.4 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. మున్సిపాలిటీ పరిధిలో 7వేల ఎల్ఈడీ దీపాలు, 9వేల నివాసాలకు ఇంటింటికీ నల్లా కనెక్షన్లు అందించారు. షాదీఖానా, స్లాటర్ హౌజ్, హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులను రూ.61 కోట్లతో చేపట్టారు. రోడ్లను శుభ్రం చేసేందుకు రూ.42 లక్షలతో స్వీపింగ్ మిషన్ కొనుగోలు చేశారు. అమృత్ పథకం కింద తాగునీటి సరఫరా పైపులైన్ల నిర్మాణాన్ని రూ.173 కోట్లతో చేపట్టారు. పట్టణం మీదుగా వెళ్తున్న కోదాడ– జడ్చర్ల రహదారి నిర్మాణంలో భాగంగా రోడ్డు విస్తరణ, డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్ నిర్మాణానికి రూ.126 కోట్ల నిధులు మంజూరు కాగా పనులు చేపట్టారు.



మిని ట్యాంక్‌బండ్‌గా మారిన మిర్యాలగూడ పెద్ద చెరువు

## బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం

నియోజకవర్గ వ్యాప్తంగా ఆయా మండలాలతోపాటు మిర్యాలగూడ మున్సిపాలిటీలో సుమారు రూ.300 కోట్లతో బీటీ, సీసీ రోడ్లు, మినీ కల్వర్టులు నిర్మించారు. నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీలతోపాటు అన్ని గ్రామాల్లోనూ సీసీ రోడ్లు వేశారు.

- నియోజకవర్గ పరిధిలో వాగులపై చెక్ డ్యామ్‌ల నిర్మాణం కోసం రూ.56 కోట్లు మంజూరు చేసింది. వీటితోమాడ్గులపల్లి, వేములపల్లి, దామరచర్ల, మిర్యాలగూడ మండలాల పరిధిలో 12 చెక్‌డ్యామ్‌ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి.
- మన ఊరు–మన బడి పథకం కింద రూ.40 కోట్లతో 70 ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరిస్తున్నారు. అలాగే దామరచర్ల మండలంలో మూడు ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.7 కోట్లు మంజూరు చేసింది.
- నియోజకవర్గవ్యాప్తంగా గ్రామీణ ఆస్పత్రులు నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.5.60 కోట్లు మంజూరు చేసింది. త్వరలో ఈ భవన నిర్మాణాలు చేపట్టనున్నారు. గ్రామీణులు చిన్నపాటి జబ్బులకు పట్టణ ఆస్పత్రులకు వెళ్లకుండా గ్రామంలోనే వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ఆస్పత్రులు ఏర్పాటు చేస్తున్నది.
- మిర్యాలగూడ పెద్ద చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా ఎంపిక చేసి ఆధునీకరణకు రూ.25 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటి వరకు చెరువు కట్ట ఆధునీకరణ, లింకు రోడ్డు నిర్మాణం, అలుగుపై బ్రిడ్జి, బతుకమ్మ ఘాట్లు నిర్మించగా, మిగిలిన పనుల పూర్తికి అధికారులు కసరత్తు చేస్తున్నారు.
- మిర్యాలగూడలోని ప్రకాశ్‌నగర్, షాబునగర్‌లో రూ.80లక్షలతో బస్తీ దవాఖానలు ఏర్పాటు చేసింది. మరో రెండు ఆస్పత్రులను త్వరలోనే ఏర్పాటు చేయనున్నారు.
- నియోజకవర్గవ్యాప్తంగా 54,001 మందికి రైతుబంధు పథకం కింది రూ.554.89 కోట్లు సాయం అందించా రు. అలాగే 798మందికి రైతు బీమా పథకం కింద రూ.39.90 కోట్లు అం దించారు. 3,139 మందికి రూ.14,56,91,500 సీఎం సహాయ నిధి అందించారు.
- నియోజకవర్గంలో 5,263 మందికి కల్యాణలక్ష్మి కింది రూ.52,66, 10,160 అందించారు. 22,628 మందికి ఆసరా పింఛన్లు అందించారు.



మిర్యాలగూడ పట్టణంలో నిర్మించిన ఆధునిక వైకుంఠధామం

## దేశానికే తలమానికం యాదాద్రి పవర్ ప్లాంట్

దామరచర్ల మండలం వీర్లపాలెంలో రూ.30 వేల కోట్లతో దేశానికే తలమానికమైన యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్(వైటీపీఎస్)ను నిర్మిస్తున్నారు. 4,276 ఎకరాల్లో ఈ ప్రాజెక్టు నిర్మాణం కొనసాగుతున్నది. మరో 6 నెలల్లో పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఈ పవర్ ప్లాంట్ నిర్మాణం పూర్తయితే 4 వేల మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి రానున్నది. ఈ పవర్ స్టేషన్‌లో ఐదు బాయిలర్లు ఒక్కొక్కటి 800 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్నారు. ఈ ఐదు యూనిట్లు 90 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి.

## పల్లె ప్రగతితో పల్లెలు అభివృద్ధి

నియోజకవర్గవ్యాప్తంగా రూ.54 కోట్లతో రైతు వేదికలు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించారు. అదేవిధంగా ప్రతి గ్రామానికి ఒక ట్రాక్టర్, వాటర్ ట్యాంక్ అందించారు. గతంలో శ్మశాన వాటికలు లేక ఇబ్బంది పడ్డ ప్రజలు ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైకుంఠధామాలతో ఆఖరి మజిలీ చింత తీరింది.

## 50 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం

నియోజకవర్గంలో కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీల అభివృద్ధికి సీఎం కేసీఆర్ అధిక నిధులు మంజూరు చేశారు. సుమారు రూ.10 కోట్లతో 50 నూతన గ్రామ పంచాయతీ భవనాలు నిర్మిస్తున్నారు.



మాడ్గులపల్లి మండలం ఆగామోత్కూర్, బొమ్మకల్ గ్రామాల పరిధిలో నిర్మించిన చెక్‌డ్యామ్